# ఓం యమాయ నమః

కాటూరు రవీంద్ర త్రివిక్రమ్

"అదీ సంగతి! ఏం చెయ్యాలో మాకర్థమైచావట్లేదు..." అన్నాడు ముగింపు మాటలుగా ముత్యాలు.

అంతవరకు అన్నదమ్ములు చెప్పిందంతా విన్న అచ్యుతం, ఆరిపోయిన చుట్టని అర్జంటుగా అవతల పారేశాడు.

"ఇదంత వీజీగా తేలే యవ్వారం గాదు. అవతల మీ నాన్న ఇరణ్యాకసిపుడు. నాటువైద్దం సేత్తే కొంప లంటుకుపోతాయ్.. నావిగాదు... మీవి!" అన్నాడు అచ్యుతం.

"మావాc! యీ వూళ్ళో కొంప లంటించినా, ఆర్పినా అందుకు సమర్ధుడివి నువ్వే గంద? మాకేదో దారి చూపెట్టు" అన్నాడు ముత్యాలు తమ్ముడు సత్యాలు.

"నాగ్గనిపిస్తే గద నీకు సూపెట్టేది! మీ నాన్న ఎలాంటోడనుకున్నావ్. గట్టిగా నవ్వేడంటే అయిదూళ్ళకినపడతది. ఉరిమి చూసాడంటే ఊరు వణికిపోతది. నాల్రోజులు దిలాసాగా చుట్ట కాల్చుకుంటూ బతకాలని ఆశపడ్డాను. చూస్తుంటే, మీ వల్ల నాకు పోయేకాలం వచ్చేట్టుంది."


"అట్టాగనక మావాc... నువ్ పోతే ఊరు అడివైపోద్ది. నువ్వు బాగుండాల... ఊరు బాగుండాల" అన్నాడు ముత్యాలు.

"సరే సాయంత్రం గనపడండి చూద్దాం" అన్నాడు అచ్యుతం అరుగు మీదనుండి కిందికి దిగి.

"చూద్దాం అనకు మావాc... చేద్దాం అను" అన్నాడు సత్యాలు రెండు చేతులూ పట్టుకుని.

"రేయ్ సిన్నాడా... నా బుర్ర తినబాక... మీ అమ్మ నాకు సవితి చెల్లెలయినా సొంత చెల్లెల్లాగానే చూసుకుంటున్నా గంద. దాని కడుపున పుట్టిన మిమ్మల్ని గాలికొదిలేస్తానేంట్రా?"

"అట్టాగన్నావ్ బావుంది... పదరా చిన్నాడా..." అంటూ ఆనందంగా ఇంటిదారి పట్టాడు ముత్యాలు.



అచ్యుతం జేబులోంచి చుట్ట బయటికి తీసి వెలిగించబోయాడు.

అగ్గిపెట్టె మొరాయించింది. రెండు పుల్లలు గీసినా వెలగలా.

విసుగుపుట్టి, చుట్ట జేబులో పెట్టుకుని ఇంటిదారి పట్టాడు.

దారిలో తెలిసిన వాళ్ల పలకరింపులకి పరధ్యానంగా సమాధానాలు చెబుతూ ఇల్లు చేరాడు, అచ్యుతం.

''ఏమిటలాగ వున్నారు?'' అంది తులసి.

''ఎట్టా ఉన్నాను?'' అన్నాడు పెళ్లాంకేసి వింతగా చూస్తూ.

''ఏదో పోయినట్టు...''

''నిజంగానే పోయింది...''

''నా మేనల్లుళ్లిద్దరికీ పెళ్లిళ్లయ్యాయా? పెళ్లాలు కాపురానికొచ్చారా? వాళ్లకీ సరదాలు సంపెంగలూ వుంటాయా? ఆ ముసలోడు యివేమీ ఆలోచించకుండా వీళ్లని ఏసంకాలం ఎండలో, వానాకాలం నీళ్లలో నిలబెడుతున్నాడు..''

''ఏంటది?''

''మతి..''

''నాకర్థంగాలా...''

''మొదట నాకూ అర్థంగాలా... అర్థం అయ్యాక గుండె జారిపోయింది. మతి గతి తప్పింది..''

''అబ్బ... కాస్త అర్థమయ్యేట్టు చెప్పండి...''

''అది తెలియకే నేను కొట్టుకు చస్తన్నా.. సరే విను - మా ముత్యాలు, సత్యాలు తెలుసుగా?''

''ఎందుకు తెలియరూ... మీ మేనల్లుళ్లేగా?''

''వాళ్లిద్దరూ నా పీకకి ఉరిపెట్టారు''

''మెడమీద అలాంటి గుర్తులేమీ లేవే...'' మెడ తడిమి చూస్తూ అంది తులసి.

''నువ్వింత తెలివితక్కువ దానివి కాబట్టే నేను పెళ్లి చేసుకోవాల్సొచ్చింది...''

''నాకు తెలివేం తక్కువ...''

''అదే నేను ఏడ్చేది! నువ్వు తెలివి తక్కువ దానివని నేను చెప్పేదాకా నీకు తెల్వదు. చెప్పినా వప్పుకోవు..''

''అబ్బ... చంపక విషయం ఏమిటో చెబుదురూ?''

''మా బావ ఎలాంటోడు?''

''మీరే చెప్పండి... మళ్లీ తెలివి లేదంటారు!''

''వప్పుకున్నావ్ గద? అయితే విను...''

''చెప్పండి...''

''నా మేనల్లుళ్లిద్దరికీ పెళ్లిళ్లయ్యాయా? పెళ్లాలు కాపురానికొచ్చారా? వాళ్లకీ సరదాలు సంపెంగలూ వుంటాయా? ఆ ముసలోడు యివేమీ ఆలోచించకుండా వీళ్లని ఏసంకాలం ఎండలో, వానాకాలం నీళ్లలో నిలబెడుతున్నాడు..''

''ముసలోడెవరూ?''

''అడిగావా?! అనుకుంటూనే వున్నా. ఇంకెవరో అయితే నాకేం బాద? ఇదంతా మా భూషణం బావ గురించే వాగేది.''

''ఆయన ముసిలాడేంటండీ?!'' ఆశ్చర్యంగా అడిగింది తులసి.

''ఆయన కాకపోతే నేను ముసిలాడ్ని! విషయం ముసలితనం గురించి కాదు.. ఇద్దరు కొడుకుల్నీ ఇంటికాడే అట్టే పెట్టుకున్నాడు. పొలం పనులన్నీ పురమాయిస్తుంటాడు. కర్చుల కింద నెలకి తలో రెండొందలూ యివ్వొచ్చుగంద?''

''వీళ్లడిగితే ఎందుకివ్వడూ?''

''మా ఆయనే ఉంటే మంగలాడు దేనికన్నట్టు - ఈళ్లిద్దరికీ అంత దయిర్యం వుంటే మన దగ్గరకెందుకొస్తారు?''

''ఇంతకీ మీరేం చెప్పారు?''

''ఏం చెప్పాలో తెలియక నెత్తి బాదుకుంటున్నా.... నీకేమన్నా తోస్తే చెప్పు''

ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా బరువు తగ్గడం సాధ్యమేనా ?

బరువు తగ్గితే చర్మం ముడతలు పడుతుందా ?

మూడు పూటలా తింటూ బరువు తగ్గడం సాధ్యమేనా ?

ఎన్ని కిలోల వరకు బరువు తగ్గవచ్చు ?

ఈ ప్రశ్నలకు సరైన సమాధానాలు వచ్చే శీర్షికలో తెలుసుకోండి.

ప్రతి శుక్రవారం సాయంత్రం 5-50 ని॥లకు డాక్టరు గారి సలహాలను మాటీవి 'సంజీవిని' ప్రోగ్రాంలో చూడవచ్చు.

CLINIC 2000
*Makes the difference*

**Himayathnagar :** 203, Sai Datta Arcade
Besides Mitra Agencies Maruti Show Room,
Himayathnagar, Hyderabad-500 029.
Ph : 5566 9595, 5561 5599, 2763 5522 www.clinic-2000.com

**The only Medical Center for Overweight & Laser Hair Removal**

## గాజుల మలారంలో 'ఉదయశ్రీ'



ఒకసారి కరుణశ్రీ గారింటికి ఒక గాజుల సెట్టి వచ్చాడు. కవిగారి భార్య గాజుల మలారానికి దండం పట్టుకొని తనకు సరిపడే గాజులను ఎంచుకొంటున్నది. శ్రీమతి కొంటున్న గాజులను చూడడానికి కరుణశ్రీ అక్కడికి వచ్చారు. ఎదురుగా గాజుల మలారంలో 'ఉదయశ్రీ' కావ్యం కనిపించగానే కరుణశ్రీ చాలా ఆనందించారు.

ఆనందాన్ని మనసులో దాచుకొని తానెవరో చెప్పకుండా కరుణశ్రీ గాజుల వర్తకుడిని అడిగి ఉదయశ్రీ పుస్తకం తిరగేస్తూ ఆ బేరగాడితో సంభాషణ మొదలు పెట్టారు.

''సంగీతం వలన బేరసారములుడిగెన్'' అన్నట్లు ఇదెందుకు నీకు?''

రోజంతా బేరం వుండదు గదా బాబూ! తీరిక సమయలో ఈ పుస్తకంలో పద్యాలు పాడుకుంటూ కాలక్షేనం చేస్తాను''

''పద్యాలు అర్థమవుతాయా నీకు?''

''అబ్బో! అర్థంగాక పోవటమేమిటండీ? ఒక్కొక్క పద్యం ఒక్కొక్క రత్నం గాదా!''అని ఉదయశ్రీని తన చేతికి తీసుకొని ''పుష్పవిలాపం'' ''కుంతీకుమారి'' మొదలైన ఖండకావ్యాలను కవిగారికి వినిపించాడు. అతని గొంతుకూడా శ్రావ్యంగా వుంది. ఆ ఖండ కావ్యాలను అతడు పారవశ్యంతో ఆలపించగానే కరుణశ్రీ పరమానందభరితులయ్యారు.

విమర్శకులేమన్నా తాను మాత్రం ప్రజాకవినని కరుణశ్రీ సంతృప్తులయ్యారు.

తానెవరో చెప్పకుండానే గాజుల బేహారీకి ఇవ్వవలసిన డబ్బు ఇచ్చి పంపించారు.

– సేకరణ: రామమోహనరాయ్

''బాగానే వుంది! నాకేం తెలుసు?''

''నువ్వు గొప్ప తెలివిగల దానివిగా యీ మాత్తరం చెప్పలేవేంటి?'' గడుసుగా అడిగాడు.

''సర్లెండి. మీ ముందు నా తెలివి ఎంత?''

''వప్పుకున్నావ్‌గా? మరెల్లి అన్నం వడ్డించు. ఆకలి దంచేస్తోంది'' అంటూ కుర్చీలో కూలబడ్డాడు.

***

''బావా! వంటరిగా నీతో కాస్త తుంటరి మాటలు మాట్లాడాలని వచ్చా. నువ్వు నుంచోమంటే కూచుంటా. కూచోమంటే నుంచుంటా ఏంచెయ్యమంటావో నువ్వే చెప్పు...''

''కల్లుగానీ తాగొచ్చావేంట్రా?'' కళ్లెర్రజేశాడు కిష్టయ్య.

''లేకపోతే నీతో మాట్టాడే దమ్ములు నాకు లేవు మరి''

''ముందు యిసయం ఏంటో జెప్పు...'' చుట్ట తీసి వెలిగించుకుంటూ అన్నాడు. చివ్వున వెలిగిన అగ్గిపుల్లనీ, చురచుర అంటుకున్న లంక చుట్టనీ అసూయగా చూశాడు అచ్యుతం.

''అందుకే నీ వైభవం యింద్రుడితో సమంగ ఎలిగిపోతాంది...'' అన్నాడు నడుంమీద చేతులేసుకుని.

''ఏంటదీ?'' అన్నాడు ఎర్రగా చూస్తూ.

''అద్గో అలా సూపుల్తోనే సంపేస్తావని తెలిసే మూడు ముంతలు తాగొచ్చా.... ఉహూఁ.. మాటలు పెగిలిసావటంలా... ఇంకో ముంతా తాగొస్తానుండు..'' వెళ్లబోయాడు.

''రేయ్.. పిచ్చివాగుడు మాని, వచ్చిన పనేంటో జెప్పు... లేకపోతే వీపు పేలిపోద్ది''

''అన్నావా! అంతమాట అనేసాక మరి సెప్పక పోతే తప్పుగా వుంటది. సెప్పేస్తున్నా..''

''చెప్పేహే... ఎదవ సన్నాసి'' కసురుకున్నాడు కిష్టయ్య.

''ఇంతకీ నన్ను కూచోమంటావా, నుంచోమంటావా?''

''ఒంటి కాలిమీద నుంచో...''

''సరే.. యిదుగో నుంచుంటున్నా..'' అంటూ ఒక కాలు పైకి మడిచి చేత్తో గట్టిగా పట్టుకున్నాడు.

''యిషయం చెప్పు...''

''మన ముత్తెం, సత్తెం సచ్చిపోతారంట. రెండు పురుగు డబ్బా మందులు... చ ఛ... రెండు పురుగు మందుల డబ్బాలు తెమ్మన్నారు..''

కిష్టయ్య చేతిలోంచి చుట్ట జారిపోయింది.

''ఏవొచ్చింది రోగం వాళ్లకి?''

''రోగం వచ్చి చావాలంటే అరవైదాకానన్నా ఆగాలిగా? అందుకని పురుగుల మందు అడుక్కు రమ్మన్నారు. అల్లుళ్ల మాట కాదనలేక వచ్చా... రెండు డబ్బాలిస్తే వెళ్లి యిచ్చొస్తా... ఉహూఁ... రాను... అటే ఎల్లిపోతా...''

''పెళ్లిజేసి పెళ్లాలతో కాపురం జేసుకోండ్రా అంటే మందు తాగి చస్తారంట్రా...'' చుట్ట నిప్పుని కాలికింద నలుపుతూ అన్నాడు కోపం పొంగుతుండగా, కిష్టయ్య.

''మరి సావక ఏంజేత్తారు. నువ్వు పైకర్సుకి పైసకూడ ఇవ్వట్లె. పాలేరుకన్న తక్కువగా చూత్తావయ్యే...''

''అవున్రా... ఆస్తంతా నేను అట్టుకుపోతానా? ఈడనే... ఈళ్లకే వదిలిపోతాగా?''

''అందాకా ఈళ్లు మాడి సావాల్సిందేనా?''

''తిండికేవన్నా తక్కువ జేసానా?''

''తిండొక్కటేనా బతుకంటే? పెళ్లాలకి అచ్చటా ముచ్చటా చూడొద్దా? సాటుగా దాన్యం అమ్మాలంటే గింజలతో సహా నీకు లెక్కేనయ్యె.. బతకలేక సావలేక పెళ్లాల ముందు సన్నాసుల్లా ఏడుత్తున్నారు...''

''ఇదంతా నీకు చెప్పారా?''

''అసలు సంగతి చెప్పమంటావా?''

''ఏంటది?''

''అందరూ ఎంకటేశ్వరస్వామిని పూజిస్తుంటారు... మీవాళ్లు ఓం యమాయనమః అని యముడ్ని పూజిస్తున్నారు.''

''తొందరగా పైకి తీసుకెళ్లమనా?''

''అనే! కానీ, ఆళ్లని కాదు...''

''యింకెవర్ని?''

''నిన్నే!''

''ఆఁ??''

''ఆఁ!!''

''ఆళ్లు బాగా బతకాలంటే నువ్వు పైకెల్లిపోవాల! అందుకే అదేపనిగ యముడ్ని పూజిస్తన్నారు... ఏం లాబం? యముడిక్కూడా నువ్వంటే బయమని కుర్రసన్నాసులకి తెలియక తప్పుజేశారు. నేనే ఉపాయం చెప్పా. ఇయన్నీ లాబం లేదు... తలో డబ్బా పురుగుల మందు తాగితే, యముడు పరిగెత్తుకుంటూ వస్తాడు ఆడికదే నైవేద్యం అన్నా... అయితే, మా నాన్న నడిగి రెండు డబ్బాలు పట్రమ్మని నన్ను పంపారు. తాళం చెవులు నీ దగ్గరే ఉంటయ్‌గా మరి! తొందరగా రెండు డబ్బాలిస్తే నే ఎళతా... కాలు కిందకి పెడతా బావా... నొప్పెడతాంది'' అంటూ రెండు కాళ్లమీద నిలబడ్డాడు.

కిష్టయ్య బుర్ర గింగిరాలు తిరిగిపోతోంది.

తన గురించి కొడుకులింత అసహ్యంగా అనుకుంటున్నారా?

తనకెన్నడూ తోచనే లేదే?

ఛీ... ఎంత తప్పుచేశాడు...

ఊరి పెద్ద పిల్లలు, పిల్లుల్లాగా బతుకుతున్నారు.

''రేయ్ అచ్యుతం..'' అంటూ జేబులోంచి నోట్లు తీసి యిస్తు ''యివాళ నుంచీ వాళ్లకేం కావాలన్నా అడగమను.. లేపోతే నువ్వొచ్చి తీసుకెళ్లు...'' అన్నాడు.

చప్పున అందుకుని ''ఇప్పుడు నువ్వు పెత్తందారువి బావా! ఉప్పుని కర్పూరం సెయ్యగలవోడివి... నీకు సేతులెత్తి దండం పెడతా... మళ్లీ మారబోకు...'' అంటూ ఆనందంగా పరుగు తీశాడు అచ్యుతం.

కిష్టయ్య మందహాసం చేస్తూ మీసాలు సవరించుకున్నాడు.

భార్య మంగమ్మ చాటుగా కళ్లొత్తుకుని, కృతజ్ఞతగా మొగుడికేసి చూసింది.